# త్రిశంకు నరకం



భానుమతీ రామకృష్ణ

సాధారణంగా పైకి గంభీరంగా వుండే వాళ్ళు లోపల చాలా పిరికిగా వుంటారు. అదే మేకపోతు గాంభీర్యం అన్నారు... లోపల చాలా ధైర్యంగా వుండేవాళ్ళు పైకి ఎంతో పిరికివాళ్ళలా కనబడతారు... యిలాంటి విరుద్ధ స్వభావాలుకల వ్యక్తులు సమయం వచ్చినప్పుడు బయటపడుతుంటారు.

ఆమధ్య మద్రాసులో హిందీ ఒళిగ అంటూ అల్లర్లు ఆరంభం అయినయి... స్టూడెంట్స్ స్ట్రయిక్ చేయడం, కర్‌ఫ్యూ ఆర్డర్స్ వేయడం కూడా జరిగింది...పని మీద వెళ్ళిన నేనూ, నాతోకూడా వచ్చిన యిద్దరు స్నేహితురాండ్లూ హైద్రాబాద్‌నుంచి మద్రాసుకు రావాలి మర్నాడు — ఎలా, ప్లేన్ టికెట్స్ బుక్‌చేసి వారం రోజులయింది — ప్లేన్ అయితే మద్రాసు వస్తుంది గాని ప్లేన్ దిగి యింటికి వెళ్ళడానికి కారు రాదన్నారు... డ్రైవర్స్ రారట — సైకిలూ, బస్సూ, కారూ, జట్కా, యిత్యాది వాహనాలేవీ రోడ్డుమీద కనిపించగూడదట... మనుష్యులుకూడా గుంపుగా నడవగూడదట... యింటికి ట్రంకాల్‌చేసి మాట్లాడితే తేలిన సారాంశం యిది. పొరపాటున ఎవరైనా కారు బయటికి తీస్తే, ఆ డ్రైవర్ని లేక ఓనర్ని చచ్చేట్టు తంతారట, లేకపోతే ఆ కారు బయటికి తెచ్చినవాడి నెత్తికెత్తి నడవమంటారట. కాబట్టి అల్లర్లు తగ్గిందాకా మీరు రావద్దు, అక్కడే వుండండి టికెట్స్ కేన్సల్ చేసి. అంటూ మావారు ఫోన్‌లో సలహా యిచ్చారు. ఒకవేళ మీరు బలవంతంగా రాదలచుకున్నా మద్రాసు వచ్చి ఏరోడ్రోమ్‌లోనే వుండిపోయేట్లయితే రావచ్చన్నారు. లేదా ఏరోడ్రోమ్ నుంచి యింటికి నడచి వచ్చేట్లయితే రమ్మన్నారు. నవ్వుతూ.

"బాబోయ్! నడచివెళ్ళడమే; మీనంబాకమ్ నుంచి కోడంబాకం! మావల్లకాదు. అంటూ నా స్నేహితురాండ్లూ నేనూ తలలు పట్టుకుని తలోకుర్చీలో కూలబడ్డాం పైగా నడిచివెళ్ళినా యిద్దరు ముగ్గురు కలిసి వెళ్ళగూడదు; తీసుకెళ్ళి జైల్లోపారేస్తారట. ఒక్కొక్కరే దూరదూరంగా నడచి వెళ్లాలిట ఏమిటీ ప్రారబ్ధం సడన్‌గా యిట్లా వచ్చింది! ఎలా యిల్లు చేరడం పిల్లల్ని చూడడం!" ఆ సమయంలో సముద్ర మధ్యంలో వున్న ద్వీపంలా కనిపించింది హైద్రాబాదంతా.

"పిల్లల్ని వదిలేసివచ్చాం — ఈ స్ట్రయిక్ గొడవల్లో మా పిల్లలు ఏమయ్యారో! స్కూళ్లూ మూసేశారు." అంటూ కండ్లు తుడుచుకుంది ఓ స్నేహితురాలు. "మావాడొట్టి దుడుకువెధవ. ఈ స్ట్రయికులో వాడూ వుండి ఏం గలాటాలో చిక్కున్నాడో?" అంటూ యింకొకావిడ పడక మీద పడిపోయింది. మా వాడి సంగతి జ్ఞాపకం వచ్చింది. మెడికల్ కాలేజీ వాళ్ళందరితోపాటూ వీడూ ఏం చేస్తాడో అనే ఖంగారు నాకున్నా వాళ్ళ నాన్నగారు చూసుకుంటారులే అనే ధైర్యం తెచ్చుకున్నాను. పడకమీద పడిపోయిన స్నేహితురాలు చివాల్న లేచి "ఓ పని చేస్తేనో, పోనీ మనం రైల్లో వెళ్ళిపోతేనో" అంది. "ప్లేన్ కంటే రైలంటేనే నా ప్రాణానికి హాయిగా వుంటుందిగాని. రైలు పట్టాలు అక్కడక్కడా లేవన్నారే" అన్నాను.

"అవును అదీ నిజమే...ఈ అల్లర్లలో రైళ్లో ప్రయాణం మరీ డేంజర్...లాభం లేదు." అంటూ మళ్ళీ పడకమీద వాలిపోయింది.

"రేపు ప్రొద్దుటికి అంతా చక్కబడుతుందర్రా...మనం వూరికే ఖంగారు పడుతున్నాంగానీ. చూడండి నా మాటా"! అంటూ మొదటావిడ ధైర్యం చెప్పడం మొదలెట్టింది. ఎక్కడో ఆశ తళుక్కుమంది — ఒకవేళ ప్రొద్దుటకి అల్లర్లు తగ్గి ఇల్లు చేరుకుంటామేమో ఎవరికి తెలుసూ అని. మళ్ళీ ఫోన్‌చేశాం మదరాసుకు. పరిస్థితి యింకా ఏం మార్లేదు. బహుశా తెల్లవారేసరికి మారవచ్చు. ఢిల్లీనుంచి ఎవరో వస్తున్నారు — పెద్దవాళ్ళు అన్నారు. మావాడు వాళ్ళ ఫ్రెండ్ ఇంటికివెళ్ళి అక్కడే "స్టకప్" అయినాట్ట — తిరిగి యింటికి రావాలంటే వీల్లేదు! నాకు ఆవొక కొత్తదిగులు పట్టుకుంది. వాళ్ళ నాన్నగారితో కూడా వుంటాడనుకుని ధైర్యంగా వున్న నాకు ఆరాత్రి నిద్రపట్టలేదు. పిల్లవాడొకచోటా, వారొకచోటా, నేనొకచోటా చిక్కుబడిపోయాం. సినిమాల్లోఅయితే యిలాంటి సందర్భాల్లో ఒక 'కట్‌సాంగ్' పడేస్తారు. ముగ్గురూ

మూడుచట్లా. మూడు చరణాలూ పాడి ముగిస్తారు. కాని వాస్తవ ప్రపంచంలో అలాంటి సందర్భాల్లో దిగుల్తో గొంతు పూడుకుపోతుందికాని పాట్టానికి గొంతు పెగుల్తుందా. రేడియోలో పాట వినిపించినా చీకాకు పుట్టుకొస్తుంది. ముందు ఒడ్డున పడితే చాలనిపించేపరిస్థితిలో ఆరాత్రి నేనూ నా స్నేహితురాండ్లూ తిరుపతి దేవుడికి మొక్కాం — ఎలాగైనా మర్నాడు యిల్లు చేర్చమని. హైద్రాబాదు అండమాన్స్‌లా కనిపించిందారాత్రి మాకు. యిల్లు ఎలా చేర్తామా అనే దిగుల్తో అలిసిపోయిన మేము ఎప్పుడు నిద్రపోయామో తెల్లవారుతూండగా మెళుకువ వచ్చింది.

"గుడ్ న్యూస్! గుడ్‌న్యూస్! అంటూ ఎవరో మా అవస్థ చూసిన ఒక పెద్దమనిషి పరుగెత్తుకొచ్చి చెప్పాడు. మద్రాసులో కర్‌ఫ్యూగట్రా తీసేశారు. బస్సులూ కార్లూ మామూలుగా పోతున్నాయట. గలాటాలు నిన్నరాత్రే నిల్చిపోయాయిట.

"హమ్మయ్య! ఎంత రిలీఫ్! ఏడుకొండలవాడా! అంటూ రెండో ఆవిడ దణ్ణం పెట్టుకుంది తిరుపతి దేవుడికి.

"ఇక ప్రయాణానికి సిద్ధంకాండర్రా! నేను రాత్రే చెప్పానుగా!" అంటూ త్రికాలజ్ఞానంగల మొదటావిడ ఏదో ట్యూను హమ్ చేయడం మొదలెట్టింది సంతోషంగా. ప్రయాణానికి సిద్ధం కాండర్రా అని మొదటావిడఅంటూనే, వూరికెళ్తున్నామనే సంతోషం అంతా ఒక్కసారి మాయమైపోయింది.

ప్లేనెక్కాలి! ప్లేన్‌అంటే నాకు నైట్‌మేర్. ప్లేన్‌లో ప్రయాణం చేయడం నా మటుకు నాకు యమయాతన అనుభవించినట్లుంటుంది. ఎందుకో తెలీదు? నాలాగా భయపడేవాళ్ళు యీ కాలంలో ఎంతమంది వున్నారో తెలీదు గాని, నేను మాత్రం ప్లేన్‌లో వెళ్ళడం అనేది యిక విధిలేని పరిస్థితుల్లో తప్పనిసరి అయినప్పుడు, కాసేపు ఆ నరకబాధ అనుభవించాల్సి వస్తుందిగాని లేకపోతే ప్లేన్ ఎక్కను. ప్లేన్ ప్రయాణం అంటే నేను కాస్త అనీజీగా ఫీల్‌చేస్తానని నా స్నేహితురాండ్రకు తెలుసు. కాని నా లోపల అసలు ఎంత భయం వుందో వాళ్ళకు నిజంగా తెలిస్తే నాకు తాటాకులు కట్టేవాళ్ళే. పైకి మేకపోతు గంభీరంతో వాళ్ళతోబాటు నేనూ చాలా సరదాగా డ్రెస్ చేసుకుంటున్నట్లు నటిస్తున్నానే గాని, ప్లేన్ టైమ్ దగ్గర పడేకొద్దీ ఏదో చెప్పలేని భయమూ ఖంగారూ పట్టుకున్నాయి. ఒకటి చెయ్యబోయి యింకోటి చేయడం, నాకు తెలీకుండానే ఏమిటోలా అయిపోవడం చూసి "అదేమిటీ? యింతసేపూ బాగానే వున్నావు! సడన్‌గా అలా అయిపోయావేం?" అంటూ నా స్నేహితురాండ్లు అడిగారు, పరీక్షగా నా ముఖంలోకి చూస్తూ. ఏం చెప్పేది! నవ్వడానికి ప్రయత్నించాను.

"ఒంట్లో బాగాలేదా!" అన్నారు. రక్షించారనుకుని అవు నన్నట్లు తలూపాను.

"అవును మరి. నిన్నట్నుంచి వెధవ టెన్షన్‌గదూ? మాటలా! తలనొప్పి యింకా తగ్గలేదు." అన్నా వాళ్ళిద్దరూ నిజంగా నా ఒంట్లో బాగాలేకనే అలా వున్నానని తీర్మానించారు. బ్రతుకు జీవుడా అనుకున్నాను. నన్ను పైకి చూస్తే పులిని చంపేంత ధైర్యస్తురా లనుకుంటారు. నేను ప్లేన్‌లో ప్రయాణం చేయడానికి భయపడే పిరికిదాన్నంటే నమ్మనే నమ్మరు.

"ఛాఛా, ప్లేన్ జర్నీ యీ కాలంలో హాయిగదా! వెధవ రైలు బోర్ కొడుతుంది." అంటారు కొందరు ప్లేన్ ఎక్కి వెళ్ళాలని సరదాపడేవాళ్ళు.

"ఇట్టే వెళ్ళిపోవచ్చు — మోస్ట్ కంఫర్టబుల్ జర్నీ" అంటారు మరికొందరు. నే నీ మాట లేవీ అనలేను. ప్లేన్ ప్రయాణం అంటే ఒక్కసారి గుండె గతుక్కుమంటుంది ఏమిటో! — యీ భయం పోగొట్టుకోడానికి ఎంతో ప్రయత్నించాను పక్కవాళ్ళను చూసి. లాభం లేకపోయింది. మరీ నలుగురూ నవ్వేపోతారే అనే అభిమానంతో కాసేపు పులినోట్లో తల వుంచి



నట్లు ప్లేన్‌లో కూర్చోడం తప్ప, మిగతా అందరు ప్రయాణీకుల్లాగా హాయిగా కబుర్లాడుతూనో, చదువుకుంటూనో లేక పేకాడుతూనో, ప్రయాణం చేయలేను నేను. ఏమిటీ ప్రారబ్ధం! పైగా నాకింత భయం అనే సంగతి నోటితో ఎవరికీ చెప్పడానికి అదొక నామోషీ. ఇంత భయం లోపల దాచుకుని పైకి నలుగురితోబాటు నవ్వుతూ పేలుతూ, అసలు ప్లేన్ ప్రయాణం అంటే నాకు కాస్తగూడా భయం లేనట్టు కనబడ్డానికి ప్రయత్నించడంలో, మరికాస్త 'మెంటల్ స్ట్రెయిన్' ఎక్కువ కావడం మొదలెట్టింది.

సామాన్లన్నీ కార్లో పెట్టేశారు. నా యిష్టసఖు లిద్దరూ చాలా సరదాగా హమ్ చేస్తూ కారెక్కారు. నేను నీరసంగా వెళ్ళి కార్లో కూలబడ్డాను. రాత్రి అన్నం తినకుండా, ప్రొద్దుటే టిఫిన్‌గూడా తీసుకోకుండా దిగుల్తోనూ, భయంతోనూ పది లంకణాలు చేసినట్లయిపోయిన నన్ను చూసి "ఏమిటి చెప్మా! ఉన్నట్లుండి ప్రొద్దుట్నుంచీ యింత డీలా అయిపోయావ్! అన్నట్లు నిన్న రాత్రినుంచీ ఏమీ తినలేదుగదూ! పోనీ ఏదైనా తినేసేస్తే కాస్త నీరసం

తగ్గి సర్దుకుంటుందేమో!" అన్నది ఒకావిడ.

"అంతే అంతే. నీరసంమీదనే అట్లా వుంది, అన్నది రెండో ఆవిడ. అవు నన్నట్లు తలూపాను ఆ టాపిక్ యింకా పెరగనివ్వడం యిష్టంలేక, ప్లేన్‌లోగూడా వీళ్ళిద్దరూ నా పక్కన కూర్చుంటే నా అవస్థ ఎక్కడ కనిపెట్టేస్తారోనని దిగులు పట్టుకుంది. నా పక్కన ఎవరూ తెలిసిన వాళ్ళు కూర్చోకూడదని దేవుడికి దణ్ణం పెట్టుకున్నాను. కారు ఏరోడ్రోమ్ చేరింది. ప్లేన్ యింకా బొంబాయినుంచి రాలేదన్నారు. గంట లేటట.

"సరే. గంటసేపు యిక్కడ కూర్చుని ఏం చేస్తాం! అట్లా 'షాపింగ్'కైనా వెళ్ళొద్దాం'' అంది మొదటావిడ.

"షాపింగే" అయితే గంట చాల్దు. యీ ప్లేన్ మిస్ చేశామంటే మన గతి అధోగతే. నే రాను," అన్నది రెండో ఆవిడ.

"పోనీ ఒకపనిచేద్దాం. మొన్న మనం మళ్ళీవస్తామని చెప్పాం. వాళ్ళింటికి వెళ్ళనే లేదు. యిక్కడికి వాళ్ళయిల్లు ఒక మైలు గూడా వుండదు. అక్కడికి వెళ్ళి చెప్పేసొద్దాం." అంది మొదటావిడ. నాకూ చటుక్కున జ్ఞాపకం వచ్చింది, వాళ్ళింటికి వెళ్ళనేలేదని. 'అట్లాకనిపించి వెళ్ళొస్తామని చెప్పివద్దాం, మర్యాదగావుంటుంది.' అనుకుని బయల్దేరాం.

మేము వెళ్ళేసరికి వారింట్లో అంతా భోజనాలకు కూర్చోబోతున్నారు మమ్మల్ని చూడగానే ఎంతో ఆప్యాయంగా ఆయింటి యిల్లాలు మాకు వడ్డించేశారు ఓవైపు వడ్డించిన ఆవకాయా, గోంగూరా. వంకాయా. దోసకాయపప్పూ పెరుగువడలూ వగైరా కమ్మటి వంటకాల వాసనలు మా శరీరాలను మాకు తెలీకుండానే వడ్డించిన ఆకులవైపు లాగుతున్నా. మళ్ళీ భోజనాలయ్యేలోగా ప్లేన్ వచ్చేస్తుందేమో నన్న ఖంగారు మమ్మల్ని కూర్చోనివ్వలేదు.

మీరు తాపీగా భోంచేసి వెళ్ళొచ్చర్రా! యీకాలంలో ప్లేన్లు రైళ్ళకంటే అన్యాయంగా వస్తున్నాయి. గంట లేటంటే రెండుగంట లన్నమాట. చాలా టైముంది. మీరు హాయిగా భోంచేసి తాపీగా తాంబూలం వేసుకుని వెళ్ళొచ్చు. ఏం తొందర్లేదు," అంటూ వడ్డించేశారు ఆయింటి యిల్లాలు.

ఆమె మాటలు అక్షరాలా నిజమయాయి. భోజనాలకు కూర్చునే ముందు మాకు సందేహం తీరక ఫోన్ చేస్తే రెండు గంటలు లేటన్నారు ప్లేన్. యిక ముగ్గురం ఆకులముందు కూర్చుని పేరుపేరు వరసలా వంటకాలన్నీ వర్ణిస్తూ చక్కగా అన్నీ ఒక్కటిగూడా విడవకుండా ముక్కువరకూ పట్టించాం. అన్నింటికంటే మించింది ఆ యింటి యిల్లాలి అమృత హృదయం. అందుకే ఆ వంటకాలన్నీ అంతరుచిగా వున్నాయని అనుకుంటూ, మద్రాసులోసాంబారుకు అలవాటుపడ్డ మేము, అసలైన విందు భోజనం ఆరగించడంలో కాసేపు యీ ప్రపంచాన్నే మర్చిపోయాం.

"త్వరగా బయల్దేరదాం. కొంచం ముందుగానే వెళ్ళడం మంచిది." అన్నది రెండో ఆవిడ.

"ఎక్కడికీ!" అన్నది పరధ్యానంగా మొదటావిడ, భుక్తాయాసంతో సోఫాలో చేరబడి అందరం ఒక్కసారి నవ్వేసరికి. "ఓహో ప్లేన్‌కా!" అంటూ ఆవిడా నవ్వేసింది.



"చూశారా! భోజనం మత్తు ఎంతపని చేస్తోందో! యిక శల విప్పించండి" అంటూ లేచారు నా స్నేహితురాండ్లు.

"ఆఁ, పోవచ్చులెండి తొందరేమిటి! మీ ప్లేన్ మా యింటిమీదుగానే వెళ్తుంది. యింకా రాలేదు. కూర్చోండి. పసుపు కుంకుమ తీసుకొస్తాను." అంటూ ఆమె లోపలికి వెళ్లారు.

ఇంతలోనే ఆ వూర్లోనే వుండే నా రెండవ స్నేహితురాలి మేనమామ మేము అక్కడికి వచ్చాం అని తెలిసి అవిశిని చూసివెళ్ళడానికి వచ్చాడు.

"ఏం. ప్లేన్ లేటట గమా?" అన్నాడు వస్తూనే. అవు నన్నది నా స్నేహితురాలు.

"ఆ...ఏ యింజనో చెడి వుంటుంది... పైకి లేటని అట్లా తళుగ్గా చెప్తారు." అన్నాడు సోఫాలో కూర్చుంటూ. యింజను చెట్టం ఏమిటి యీశ్వరా!...అంతవరకూ భోజనం అడుగునపడ్డ నా ప్లేన్ భయం మళ్ళీ తలయెత్తింది. ఆ ముసలాయన మాటలు విని. నా స్నేహితురాలు నవ్వుతూ "నీది మరీ అన్యాయం మామయ్యా! ఇంజన్ చెడితే యింకో ప్లేన్ పంపుతారు బొంబాయి నుంచి-దాని కేముందీ!" అన్నది.

"ఆఁ...యింకో ప్లేన్ ఎక్కణ్ణుంచి పంపుతారూ! దీన్నే కాస్త అట్లాయిట్లా రిపేరు చేసి పంపుతారు. అందుకే యీ



అలక్ష్యం. అడిగనక సరిగా రిపేర్ చేయక పోతే యాక్సిడెంట్స్."

"శ్రీ రామచంద్రా! ఏమిటి మామయ్యా మమ్మల్నీ పూట వూరికి వెళ్ళనిస్తావా?" అంది నా స్నేహితురాలు నవ్వుతూ.

"వెళ్ళడానికేం గానీ ... పోనీ రైల్లో వెళ్ళగూడదూ!...యీ రిపేర్ ప్లేన్‌లలో వెళ్ళడం అంత అట్టే క్షేమంగాదు. ఎందుకు చెప్తున్నానంటే మొన్నిమధ్య యిలాగే జరిగింది.

"ఆ రోజు నేను అర్జంట్‌గా మద్రాసు వెళ్లాల్సి వచ్చింది. ఎంతోసేపు రిపేరు చేసి అంతా బాగానే వుందని బయల్దేరింది. కొంతదూరం వెళ్ళాక మళ్ళీ ఏమైందో ఏమో యింజన్ ట్రబుల్ అంటూ తిరిగి వచ్చేసింది బ్రతుకుజీవుడా అంటూ బయట పడ్డాం. అదృష్టం బాగుందిగనక. చెప్పలేం. ఏ వేళ ఎట్లా వుంటుందో."

"ఈ వేళ బాగానే వుంటుందిలే మామయ్యా! ఇంకా యింటిదగ్గిర విశేషాలేంటీ" అంటూ అతని ధోరణి మార్చాలని చూసింది, నా స్నేహితురాలు. మా వైపు చూసి నవ్వుతూ, అబ్బే! అతను వినే మూడ్‌లో లేడు. "ఈ వేళ బాగా వుంటుంది అని ఎట్లా చెప్పగలవ్! ప్లేన్‌లో కూర్చోడం వరకే నీకు తెలుసుగాని, ఆ తర్వాత మన ప్రాణాలు ప్లేన్ చేతుల్లోగదా వుంటాయి. అందరూ వూరు వెళ్ళి చేర్తామనే ప్లేనెక్కుతారుగాని, యాక్సిడెంట్ అవుతుందని అనుకోరుగదా! తీరా యిక దిగబోతున్నాం అనుకునేప్పుడుగూడా ఏదైనా జరగొచ్చు, ఖర్మం చాలకపోతే. అట్లాగేగా ఒకప్పుడు నాగపూర్ ప్లేన్ యాక్సిడెంట్ జరిగింది. దిగేప్పుడే కొండమీది కెళ్ళి ఢాం అంటూ మోదుకుంది.

"ఆ ప్లేన్ క్రాష్‌లో ఎట్లాగో బ్రతికి బయటపడ్డ నలుగుర్లో నడుములు విరిగిన నా స్నేహితుడొకడున్నాడులే. వాడు ఆ రోజు జరిగిందంతా చెప్తూంటే మన చేతుల్లో ఏమీ లేదనిపిస్తుంది.

"ఆరోజు రావలసిన హోస్టెస్‌లుగూడా ఏదో పనివుందనిచెప్పి వచ్చినవాళ్ళు వెనక్కివెళ్ళిపోయారట. అంటే వాళ్ళ ఆయుష్షు గట్టిగా వుందన్నమాట. వాళ్ళిద్దరికీ బదులు యింకెవరో యిద్దరు హోస్టెస్‌లు. కోతుల్లా వున్నారట. వాళ్ళొచ్చారట. వాళ్ళను చూసి ఆ ప్రయాణీకుల్లో ఒక రసికుడు అన్నాట్టగూడా 'యీరోజు అన్నీ ఏంటిట్లా తగులడ్డాయి? వీళ్ళదుంపతెగ యీ హోస్టెస్‌లు ఎవరో కోతుల్లా వున్నారే! ఒకతీ బాగాలేదు,' అని...అసలు ఆకోతులవల్లనే ఆరోజు ప్లేన్ అట్లా అయిందంటాడు నా ఫ్రెండ్." అంటూ అతను చెప్పుకు పోతూంటే నాభయం విశ్వరూపం ధరించి. ఒళ్ళంతా ఒణకడం మొదలెట్టింది.

"బాబోయ్! మీ మామయ్య మనల్ని భయపెట్టేస్తున్నాడు." అంది యిక వినలేక మొదటావిడ.

"సరే, యివన్నీ ఎప్పుడో జరిగిన విషయాలుగదా! యిప్పుడెందుకవన్నీ. మేము సరిగానే వెళ్ళి చేర్తాంలే మామయ్యా. అత్తయ్యవాళ్ళను పండక్కి పంపించు. అమ్మ చెప్పింది." అంటూ నా స్నేహితురాలు వాళ్ళ మామయ్యను ఎలాగో అక్కణ్ణుంచి లేవదీసి బయటవరండాలోకి తీసుకెళ్ళింది వాళ్ళిద్దరూ బయటికి వెళ్తూనే అతనిమాటలువిని ఎలాగో పోయిన నన్ను చూసి "అబ్బే నువ్వు అవన్నీ మనసుకుపట్టించుకోకు. అత నొట్టి చాదస్తుడు. మనం పుట్టకముందునాటివిషయాలు చెప్పి అనవసరంగా హడలగొట్టాడు. యిప్పుడలాంటి వేవీ జరగడంలేదు, జరగవ్. మనం సేఫ్‌గా చేర్తాం. భయపడక," అంటూ ధైర్యం చెప్పింది మొదటి స్నేహితురాలు. కాని మనసు బాగా కలతపడది, నేను ఆపూట ప్లేన్‌లో ఎలా ప్రయాణం చేయగలనా! అనే అధైర్యం పట్టుకుంది. నాకు నిద్ర వచ్చేందుకు ఏదైనా యింజక్షన్ లాంటిది యిచ్చి వూరు చేరేదాకా తెలివి రాకుండా ఒక పార్శెల్లా తీసుకెళ్ళి మద్రాసులో పడేస్తేనన్నా బాగుండు ననిపించింది.

"మీ ప్లేన్ వచ్చే సిందర్రా!" అంటూ తాంబూలాలు తెచ్చారు ఆ యింటి యిల్లాలు.

"ఆఁ వచ్చేసిందా! అంటూ తుళ్ళిపడి లేచి నిలబడ్డది నా స్నేహితురాలు. నేనూ లేచాను మెల్లిగా. వాళ్ళ మామయ్యను బయట్నుంచే పంపించేసి రెండో ఆవిడా వచ్చింది — "త్వరగా వెళ్దాం ప్లేన్. వచ్చేసింది:" అంటూ హడావిడిగా.

"మీ మామయ్యేడే?" అంది మొదటావిడ నవ్వుతూ.

"అబ్బ ఒట్టి చాదస్తుడు. ఎప్పుడు ఏం

మాట్లాడాలో తెలీదు. సారీ. పాపం, మిమ్మల్ని అనవసరంగా హడలగొట్టాడు. అని వాళ్ళ మామయ్య తరఫున క్షమాపణ అడుక్కుంది. తాంబూలం తీసుకుని వెళ్లొస్తామని ఆమెగారితో చెప్పి కార్లో కూర్చున్నాం. ఏరోడ్రోమ్ దగ్గిరే గనక పది నిమిషాల్లో చేరుకున్నాం. ప్లేన్ చూడగానే ఆ ముసలాయన మాటలు జ్ఞాపకం వచ్చాయి. యింజన్లన్నీ బాగా పని చేస్తున్నాయో లేదో! ఆ చెడిపోయిన యింజన్ల ప్లేనే కొత్త ళగ్గా రిపేరు చేసి పంపి వుంటారు. ప్లేన్‌దగ్గిరికి ఒక్కొక్క అడుగు దగ్గర పడుతున్న కొద్దీ అంతులేని భయమూ, గాభరా పట్టుకొని కాళ్లు మొద్దుబారిపోవడం మొదలెట్టాయి. ఎలాగో పక్కవాళ్ళను చూసి ధైర్యం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ మెట్లెక్కి ప్లేన్‌లోపలికి వెళ్ళాను. నా స్నేహితురాండ్ల వెనకాలే ఎదురుగా యిద్దరు హోస్టెస్‌లు నిలబడ్డారు. ఒకతె అందంగా వుంది. యింకోతె కోతిలా వుంది. దాన్ని చూడగానే గుండె గతుక్కుమంది. ఆ ముసలాయన చెప్పిన నాగపూర్ ప్లేన్‌లో యిలాంటి కోతి హోస్టెస్‌లు వుండినందువల్లే అట్లా యాక్సిడెంట్ అయింది ఛీ ఛీ, ఆ ఆలోచన్లు రానివ్వగూడదు. సీటు చూపించింది అందాల హోస్టెస్. ఫర్వాలా ఒకతె అందంగానే వుంది. రెండూ కోతులైతేనే యాక్సిడెంట్ ఐంది. ఛీ ఛీ మళ్ళీ అదే వెధవాలోచన. నా స్నేహితురాండ్లు, నేను మనసులో కోరుకున్నట్లే నా పక్కన ఎవరో ముసలాయన కూర్చున్నందువల్ల, వేరోచోటా వెళ్ళి కూర్చున్నారు. ఎవరో దొరసాన్లు కూర్చున్నారు వాళ్ళప్రక్కన.

ఆ ముసలాయన బొంబాయినుండి నిద్రపోతూ వస్తున్నట్లున్నాడు మళ్ళీ నిద్రపోవడానికి ప్లేన్ ఎప్పుడు కదుల్తుందా అని ఎదురుచూస్తూ కూర్చున్నాడు. నా స్నేహితురాండ్లు వెనక్కితిరిగి నన్నూ, నా పక్కన కునుకుపాట్లు పడుతున్న ముసలాయన్నూ



చూసి నవ్వుకున్నారు నేనూ నవ్వాను వాళ్ళు చూసినప్పుడు. హోస్టెస్ చాక్‌లెట్లూ, కాటను వుండే ట్రే తెచ్చింది. కాటన్ మాత్రం తీసుకున్నాను చెవుల్లోకి చాక్‌లెట్ తీసుకోలేదు. 'కాఫీ కావాలా' అని అడిగింది. ఒద్దన్నాను. అరచేతితో ప్రాణాలు పెట్టుకుకూర్చొన్న నాకు కాఫీ ఎట్లా మింగుడు పడుతుంది! ప్లేన్‌లో అప్పుడే చాలామంది కాఫీతోబాటు ఏదో తింటానికికూడా ఆర్డర్ చేశారు. ఎలా తింటారో అంత నిశ్చింతగా—అదృష్టవంతులు. నే నలా వుండలేమగదా!

"ప్లేన్ స్టార్టయింది. ఒకటీ, రెండూ, మూడూ, నాలుగూ—వరసన ఒకదానితర్వాత ఒకటి ప్రొపెల్లర్స్ తిరుగుతున్నాయి. అవి గుండెల్లో తిరుగుతున్నట్లే అనిపించింది ఒక్క క్షణం. పైకి వెళ్ళింది. బుర్ర స్పీడుగా పని చేయడం మొదలెట్టింది. ఆ ముసలాయన చెప్పిన ప్లేన్ కథ జ్ఞాపకం రాకూడదు అనుకుని కళ్ళు గట్టిగా మూసుకున్నాను.

గంట చూశాను. మద్రాసు చేరడానికి యింకా ఒకటిన్నర గంటలసేపు కూర్చోవాలి. అబ్బ! అంతసేపూ నరకయాతన అనుభవించాలి. ! ప్లేన్ వెళ్ళేప్పుడు దాని శబ్దంలో ఏ చిన్నమార్పు వినిపించినా అనవసరంగా ఖంగారుపడే నేను చెవుల్నిండా దూది కుక్కేసి హేండ్‌బేగ్‌లోనుంచి లలితా సహస్ర నామంబుక్కు తీశాను. ఏదో భగవధ్యాన్నం చేస్తేనైనా ప్లేన్ సేఫ్‌గా చేరుతుందనే ఆశతోనూ, నమ్మకంతోనూ, ఎప్పుడు ప్లేన్‌ప్రయాణం చేసినా లలిత పుస్తకం చేతులో వుంచుకుంటాను. మధ్య మధ్య కుదుపులవల్ల కలిగే గాభరా ప్రశాంతంగా చదవనియ్యకపోయినా మనశ్శాంతి కోసం టైమ్ పోవడంకోసం అక్కడక్కడా చదువుతూంటాను. ప్లేన్‌లో కొందరు పేకాడుకుంటూ కూర్చున్నారు. కొందరు పేపరు చదువు కుంటున్నారు. కొందరు కబుర్లు చెప్పుకుంటున్నాడు సరదాగా. కొందరు హాయిగా నిద్రపోతున్నారు. నేనొక్కదాన్నే, ప్లేన్ నా నెత్తిమీద వెళ్తున్నంత భారంతోనూ, దిగుల్తోనూ కూర్చున్నాను లలిత చదవడానికి ఆరంభించాను. గప్పుమని కిందికి దిగింది ప్లేన్. గుండెలు జారిపోయాయి. చేతులో పుస్తకం వణికింది. కిటికీలోంచి చూశాను. మేఘాలు దూసుకుపోతున్నాయి. ప్లేన్‌కంటే ముందు నేను ఉక్కిరిబిక్కిరి అయినాను.



కొంతదూరం వెళ్ళాక మేఘాల దాడి తగ్గిపోయింది. కుదుపులు తగ్గాయి. హమ్మయ్య...నా పక్కన కూర్చున్న ముసలాయన బ్రహ్మాండంగా గురక పెడుతున్నాడు ప్లేన్ మోతకంటే అతను పెట్టే గురకమోత ఎక్కువయింది. అందంగా వుండే హోస్టెస్ కాఫీ తీసుకుని కేప్టెన్ కివ్వడానికి లోపలికి వెళ్ళింది. వెళ్ళేప్పుడే వేసుకున్న జానెడు పమిట కాస్తా కిందికి జారిపోయింది. పమిట సరిగా వేసుకుంటుందో. లేకపోతే అలాగే వెళ్ళి కాఫీ యిస్తుందో!

దీన్ని చూస్తూ ఆ కెప్టెన్ ప్లేన్ సరిగా నడుపుతాడో లేదో! అయినా నా కెందుకా దిగులు! ఎందు కేమిటీ – అందంగా వుండే ఆడది కాఫీ తీసుకెళితే చూడకుండా మాట్లాడకుండా ఎట్లా వుంటారు! – అట్లా చూస్తూ మాట్లాడుతూ ఆ కేప్టెనూ, పైలెట్టూ, ప్లేన్ నడపడం మర్చిపోతే మా గతేంగానూ...అదేగా నా దిగులు? ప్లేన్ వంకర టింకరగా పోతున్నట్లు అనుమానం కలిగింది. దీనితో మాట్లాడుతూ వాళ్ళు ప్లేన్ సరిగా నడపడం లేదల్లేవుంది. కాఫీ తీసుకెళ్ళి చాలా సేపయింది. ఎంతకీ రాదేం లోపల్నుంచీ! వెళ్ళిన పని చేసుకొచ్చెయ్యాలిగాని అధికప్రసంగం ఎందుకూ!

ప్చ్...యిప్పట్లో వచ్చేట్టులేదు. కోతి హోస్టెస్ నా ముందున్న వాళ్ళకు కాఫీ తెచ్చింది. దాన్ని చూడగానే ఒక్కసారి గుండె గతుక్కుమంది ... ఆ ముసలాయిన చెప్పిన నాగపూర్ ప్లేన్ యిలాంటి కోతులు వుండినందువల్లనే అట్లా కొండకెళ్ళి ఢాం అంటూ కొట్టుకుంది. కిటికీలోంచి దూరంగా కొండలు కనిపించాయి ఛీ ఛీ... అట్లా ఎందుకు జరుగుతుంది ...జరగదు...మళ్ళీ ఆ పీడ ఆలోచన్లు వస్తున్నాయి. బుర్ర ఒక్కసారి గట్టిగా విదిలించాను... మీకు కాఫీ కావాలా? అని అడిగింది కోతి హోస్టెస్. ఒద్దన్నాను. పోనీ యీకోతి తీసికెళ్ళి వుండచ్చునే కేప్టెన్ వాళ్ళకు కాఫీ! త్వరగా తిరిగొచ్చేది! పాపం మంచిది ... ఒచ్చినప్పట్నుంచీ చూస్తున్నాను–దాన్ని ప్లేన్లో కూర్చున్నవాళ్ళుగూడా పిల్చి యిది కావాలీ అని అడగలేదు. దానంత టది ఒచ్చి అడిగితే దానిముఖంకూడా చూడకుండా సరే ఏదో అఘోరించు అన్నట్లు చెప్పారేగాని ... అందరూ అదికావాలీ యిది కావాలీ అంటూ అందంగావుండే హోస్టెస్ను కేకేసే వాళ్ళే. పనున్నా లేకున్నా కాసేపు కల్పించుకునైనా కబుర్లు చెప్పుకోడానికి ఆ హోస్టెస్నే ప్రతి వాళ్ళూ పిలవడం చూస్తూనే వున్నా...

పకపక నవ్వుకుంటూ ఖాళీ కప్పూ సాసర్తో ఎట్లాగో బయటికొచ్చింది అందాల హోస్టెస్...ఆ హోస్టెస్ను చూస్తూనే మళ్ళీ ప్లేన్లో వున్నవాళ్ళందరిలోనూ చలనం కలిగింది ఒక్కొక్కళ్ళూ ఆవిణ్ణి దగ్గరికి పిల్చి ఏదో అడగడం, ఆవిడగూడా నవ్వుతూ వాళ్ళందరికీ తియ్యగా ఒంగి ఒంగి సమాధానం చెప్పడం చూశాను.


అంతవరకూ కోతి హోస్టెస్ అక్కడే వుంది. కాని ఒక్కళ్ళూ దాన్ని పిల్చిన పాపానపోలేదు. ఇంతకూ అది చేసినపాపం దాని ముఖానికంతా వికారంగా కనిపించే దాని ముక్కు. కాస్తాకూస్తా ముక్కుకాదు – ముఖాన్ని మింగేసేంత ముక్కు. సాధారణంగా సినిమాల్లో చూసే పెద్ద పెద్ద సారంగం సెట్టింగుల్లాంటివి రెండు వేసెయ్యొచ్చు దాని ముక్కుల్లో – అంత పెద్ద ముక్కు. అందాల హోస్టెస్ అందర్నీ పరామర్శించి నా దగ్గర కొచ్చి 'కాఫీ కావాలా?' అని అడిగింది, నా ముందుకు వంగి. వేసుకున్న బెత్తెడు పమిటకాస్తా జారి నా ముఖానొచ్చి పడ్డది. పమిట తీసి మళ్ళీ ఆవిడ భుజాన వేస్తూ ఒద్దని చెప్పాను. నవ్వుతూ థాంక్స్ చెప్పి వెళ్ళింది. ఆవిడటు వెళ్తూనే పైలెట్ బయటికొచ్చాడు. బాత్ రూము ముందే వుంది. అతను వెనక్కెళుతున్నా డెందుకో! వెనక్కి తిరిగిచూస్తే బాగుండదని వూరుకున్నాను. లోపల కేప్టెన్ ఒక్కడే ప్లేన్ నడపుతున్నాడన్నమాట – పైలెట్ సహాయం లేకుండా... గొడవే! 'నీ వొట్టి పల్లెటూరిదానివి. నీకేం తెలీదు' అని మావారు అంటుంటారు. ఎంత పల్లెటూరుదాన్ని అయినా ఆకాశంలో వెళ్ళేప్పుడు కాస్త వళ్ళు దగ్గరవుంచుకుని జాగ్రతగా వెళ్ళొద్దాంట; ఎంతకీ తిరిగి లోపలికి వెళ్ళడేం ఆ పైలెట్టూ. తిరిగి చూశాను, నోట్లో బ్రెడ్ముక్క పెట్టుకుని అందాల హోస్టెస్తో కబుర్లు చెబుతున్నాడు

పాపం, కోతి హోస్టెస్ కాఫీ ప్రిపేర్ చేస్తోంది పైలెట్కి. నాకు ఒళ్ళు మండిపోయింది. లోపల కెప్టెన్ని ఒక్కణ్ణీ

ఒదిలేసి యిక్కడికొచ్చి హోస్టెస్‌తో కబుర్లాడుతున్నాడు. ప్లేన్ మళ్ళీ కుదుపులు మొదలుపెట్టింది. ఈపైలెట్ త్వరగా లోపలికెళ్ళితే సరిగ్గా నడుస్తుందేమో! ... ఎంతకీ వెళ్ళడేం, జిడ్డూ! ... వెనక్కి తిరిగి చూశాను. అప్పుడే బయల్దేరాడు కాఫీ ముగించి. టైమ్ చూశాను ... నాలాగేనా గడియారంకూడా భయంతో బిగుసుకుపోయి పదిలోనే ఆగిపోయింది ... టైమ్‌కోసం నా పక్కనున్న ముసలాయనచేయి చూశాను. ఆయన గడియారంగూడా తొమ్మిదిలో ఆగిపోయివుంది. నిద్రపోవడానికి టైమ్ ఎందుకులే అనుకున్నట్లున్నాడు. కోతి హోస్టెస్‌ను పిల్చాను – టైమ్ అడగడానికి. "పన్నెండయింది. మరో అరగంటలో చేర్తాం మద్రాసు" అన్నది. ఆహా! చెవుల్లో అమృతం పోసినట్లయింది.

గంట గడిచింది. మరో అరగంట గడిస్తే గండం గడిచినట్లే. కాస్త ధైర్యం కలిగింది. నాకు తెలీకుండానే వెనక్కి చేరబడి 'రిలాక్స్' అయినాను. దూరంగా తళుక్కున మెరిసింది. మళ్ళీ గుండె గతుక్కుమంది ... ఛా ఛా, నేను కాస్తైనా స్థిమితంగా ప్లేన్లో కూర్చునేందుకు నోచుకోలేదుగదా!... మళ్ళీ అలర్ట్‌గా ముందుకు కూర్చున్నాను. ఆకాశంఅంతా నల్లటి మేఘాలు కమ్ముకోడం మొదలెట్టాయి... వర్షం వచ్చే సూచనలు కనిపించాయి. మేఘాల్లోగుండా మెరిసేవేపుకే వెళ్తోంది ప్లేన్.

మెరుపులు ప్లేన్‌కి ప్రమాదకరం అంటారు. మెరుపులు తగిలి చాలా ప్లేన్స్ క్రేష్ అయినట్లు పత్రికల్లో చూసిన గుర్తు. ఛీఛీ. యీ ప్లేన్ అట్లాకాదు. ఇది తప్పించుకుపోతుంది. ఉన్నట్లుండి ఉరుములు స్టార్టయినయి. భయం సడన్‌గా కొన్ని డిగ్రీలు పెరిగింది. ప్లేన్ బాగా కుదుపులు మొదలెట్టింది. ఒక్కసారి రివ్వున పైకెళ్ళి గబుక్కున కిందపడ్డట్లయింది. గుండె ఆగినంత పనయి ఒళ్ళంతా చల్లబడి



పోయింది. కెవ్వున కేక వేయబోయానేమోననికూడా అనుమానం కలిగి నాలుగువేపులా చూశాను. నా అవస్థ ఎవరైనా చూసిపోయారేమో అని. ఎవరు చూళ్ళా. నా స్నేహితురాండ్లు నిద్రపోతున్నారు. కాని నా కుడివేపువరస సీట్లల్లో వెనక సీట్లల్లో నాకు తోడుబోయినవాడొకడున్నాడని కనిపెట్టాను. అతను చాలా సేపట్నుంచీ నన్నే చూస్తూన్నాడని కూడా తెలుసుకొని నా అవస్థ పసిగట్టాడేమో నని ఒకింత సిగ్గుపడ్డాను. అతను పళ్ళతో పెదాలు బిగబట్టి కిటికీలోంచి అదేపనిగా ఆకాశాన్నీ భూమినీ సర్వే చేస్తున్నాడు. ఒక్కక్షణంగూడా స్థిమితంగా కూర్చోకుండా నాలాగే యమయాతన అనుభవిస్తున్నాడని గ్రహించాను. అంతవరకూ అతని అవస్థ గమనించని నాకు అతన్ని చూడగానే నా భయం కాస్త మర్చిపోయాను. అతను నాకంటే ఖంగారు పడుతున్నాడని కనిపెట్టాను. దాంతో నాలో నాకు నవ్వు ఆగలేదు. రామాయణంలో పిడకల వేట అంటే ఇదే కాబోలనుకున్నాను.

ప్లేన్ అంతకుముందు ఎన్నడూ అతను ఎక్కినట్లు తోచలా... సడన్‌గా ప్లేన్ సౌండులో మార్పు వినిపించింది. హైట్ నుంచి దిగేప్పుడూ, వెళ్ళేప్పుడూ, స్పీడ్‌లో మార్పు వచ్చినప్పుడూ అట్లా మారుతుంటుం దని విన్నగుర్తు; కాని ఆ సమయంలో పడే గాభరా ఆ విషయా లేవీ ఆలోచించనివ్వదు...అతన్ని చూశాను... అతనూ పళ్ళు బిగబట్టి కనుబొమలు చిట్లించి ఖంగారు పడుతూ 'ఏమిటి విషయం... సౌండ్ ఏమిటో సడన్‌గా మారిందే!... ఏమైవుంటుంది చెప్మా!' అన్నట్లు నా వైపు చూశాడు. మళ్ళీ అతని ఖంగారు కనుక్కుంటానేమో నని కిటికీలోంచి కిందికీ పైకీ చూస్తూ లేచి నిలబళ్ళేకా, కూర్చోలేకా, ముళ్ళమీద వున్నట్లు అవస్థ పడిపోతున్నాడు. వర్షం ఆరంభం అయింది నాగుండె వేగంగా కొట్టుకోడం ఆరంభించింది, వర్షంలో ప్లేన్ దిగడం ఎలా? కష్టంగదూ! అతన్ని చూశాను; అదే గాభరాతో అతనూ ఉన్నాడు వర్షం పడుతోందే. ప్లేన్ ఎట్లా నడుస్తుంది! ఎట్లా దిగుతుంది!...వగైరా ప్రశ్నలతో నిండిన ఖంగారు అతని ముఖంలో స్పష్టంగా కనిపించింది. మాట మాటకీ కనుబొమలు ఎగరేస్తూ, తన పక్క కిటికీలోనుంచే గాకుండా నా వైపు కిటికీల్లోంచిగూడా సీట్లునుంచి లేచిలేచి చూస్తూన్నాడు, ప్లేన్ సరిగా పోతోందా లేదా అని.




నేనే అనుకుంటే నాకంటే అన్యాయంగా భయపడుతూన్న అతన్ని చూసి నాకు నవ్వొచ్చింది. ఛీఛీ, నవ్వకూడదు. నా ధైర్యానికి తగినట్లు యింకోళ్ళను ఎగతాళి చేయడం గూడానా! క్షేమంగా వూరు చేరితే అదే పదివేలు ...తళుక్కున మెరిసింది. మరుక్షణం ఫెళ ఫెళ మంటూ ఆకాశం విరిగి కింద పడ్డట్లు ఉరిమింది. గతుక్కున కిందికిజరిగింది ప్లేన్... కెవ్వున కేకేశా రెవరో!...వెనక్కి తిరిగిచూశాను. అతనే!... భయపడిపోయి గట్టిగా అరిచాడు. ఇంకా ఒణుకుతున్న అతన్ని యిద్దరు హోస్టెస్‌లూ చెరోజబ్బ పట్టుకొని వీపు మాసేజ్ చేస్తూ మరేంభయం లేదనీ, ప్లేన్ దిగుతోందనీ, అతనికి ధైర్యం చెపుతున్నారు ప్లేన్‌లో వుండేవాళ్ళందరూ అతనివైపే తిరిగిచూట్టంవల్ల పాపం సిగ్గుపడిపోయి కండ్లు మూసుకుని నీరసంగా సీట్లో లోపలకి ముడుచుకుపోయాడు. నా స్నేహితురాండ్లు అతన్ని చూసి చచ్చేట్టు నవ్వుతూ చూశావా అతన్ని! అన్నట్లు నన్ను చూసి సౌంజ్ఞ చేశారు. పిల్లికి చెలగాటం అన్న సామెతలాగా వాళ్ళ కేం తెలుసు అతని అవస్థా నా అవస్థా? రెడ్ లెటర్స్ కనుపించాయి. నడుంబెల్టు తగిలించుకోమని. కాని యింకా గాభరాగానే వుంది. వర్షం పడుతూనేవుంది. ఎలా దిగుతుంది. దిగుతోంది. హమ్మయ్య! సముద్రం కనిపించింది... దూరంగా మద్రాసు కనిపిస్తోంది. చెవుల్లోంచి దూది తీసిపారేశాను. వెనక్కి తిరిగి చూశాను. అతను నాముఖం చూడ్డానికి సిగ్గుపడి కిటికీవైపు తిప్పుకొన్నాడు ముఖం.

మీనంబాకం ఏరోడ్రోమ్ కనిపించింది పక్కనే. మనసు సంతోషంతో నిండిపోయి అంతవరకూ అనుభవించిన యమయాతనంతా మాయం కావడం మొదలెట్టింది. కిందికి దిగుతున్నాడు. పల్లావరం కొండల్ని తాకుతున్నంత కిందికి దిగాడు. ఇట్లా దిగేప్పుడేగా! ఆ ముసలాయన చెప్పిన నాగపూర్ ప్లేన్ కొండమీద డాం అంటం. ఛీఛీ, ఆ కొండ వేరు. ఇవసలు కొండలే గావు. చూస్తూండగానే దాటిపోయాయి. ఇక కొండల్లేవు. ఒట్టి తాటిచెట్లే. అరెరే! మరీ తాటిచెట్లమీది కెళ్ళిపోతున్నాడు. వెనక్కి తిరిగిచూశాను. తాటిచెట్ల పక్కనుంచి ప్లేన్ కిందికి దిగేప్పుడు అతను కూర్చున్న సీట్లోనే ఓపక్కకు తప్పుకుంటున్నాడు. తాటిచెట్టు తనకు ఎక్కడ తగుల్తుందో నని.

ఉన్నట్టుండి దిగుతున్న ప్లేన్ సడన్‌గా పైకి వెళ్ళడం మొదలెట్టింది. ప్లేన్‌లో వున్నవాళ్ళందరి ముఖాలూ ఒక్కసారిగా పాలిపోయాయి. నా పై ప్రాణాలు పైనే పోయాయి. క్వశ్చన్ మార్కుల్లా ఒకళ్ళనొకళ్ళు చూసుకోడం మొదలెట్టారు పైకి గాభరా తెలీనివ్వకుండా. వెనక్కి తిరిగి చూశాను. అతనూ అదే అవస్థలో వున్నాడు. పళ్ళు బిగబట్టి, కనుబొమలు చిట్లించి ప్లేన్ అన్నివేపుల కిటికీల్లోంచీ ఎగిరెగిరి చూస్తున్నాడు–ఎందుకు మళ్ళీ పైకెళ్తుందా అని. నా స్నేహితురాండ్లు నావైపు చూసి భయపడవద్దని సౌంజ్ఞ చేశారేగాని వాళ్ళ ముఖాల్లోనూ గాభరా తెలుస్తూనే వుంది. అబ్బ! ఎంత కాలానికి నాతో బాటు ప్లేన్‌లో మిగతా అందరూ కాస్తన్నా గాభరా పట్టం చూడగలిగాను! ఛీఛీ. ఏం తృప్తి! వెధవ తృప్తి.

'ఓ వైపు కొంప అంటుకుంటూంటే! మళ్ళీ ప్లేన్ పైకి ఎందుకు వెళ్తుందో ఎవరైనా చెప్పి రక్షించరా!' అన్నట్లు చుట్టూ వున్న వాళ్ళందరి ముఖాలూ చూశాను. అప్పుడే హోస్టెస్‌ను పిల్చి ఎవరో అడుగుతున్నారు ప్లేన్ ఎందుకు మళ్ళీ పైకి వెళ్ళిందని. దానికీ బాగా వివరం తెలీక పైలెట్‌ని కనుక్కొస్తానని లోపలి కెళ్ళింది – యిక అది అప్పట్లో వచ్చే చెప్తుందా. మద్రాసంతా ఒక రౌండ్ చుట్టుతోంది ప్లేన్. ప్లేన్‌లో నిద్రపోయేవాళ్ళు లేరు గాని యింక సుస్తి లోనే వుండిపోయారు. వాళ్ళు ప్లేన్ అసలు వెళుతోందో లేక ఒకచోట ఆగిందో తెలుసుకునే పరిస్థితిలో లేరు. నా స్నేహితురాండ్లు మొదలుకొని ప్లేన్‌లో అందరూ పైకి కనబడని భయంతోనూ. గాభరాతోనూ

సీరియస్‌గా కూర్చుని కిటికీల్లోంచి కిందికి చూస్తున్నారు. ఒక్కసారి దిగేప్పుడు చక్రాలు కిందికిరావడం 'స్టకప్' అయితే ప్లేన్ పైన్నే తిరిగితిరిగి పెట్రోలంతా పూర్తిగా అయిపోయ్యాక దిగుతుందట. అది చాలా డేంజర్ – ప్రయాణీకుల అదృష్టంమీన ఆధారపడ్డ విషయం. హోస్టెస్ వచ్చింది నవ్వుతూ లోపల్నుంచి. దాని నవ్వు ముఖం చూడగానే సగం భయం తగ్గింది.

ప్లేన్ లేటుగా వచ్చినందువల్ల, ఆ టైమ్‌కు వెళ్ళాల్సిన ప్లేన్ అక్కడ వున్నందువల్ల, యిది దిగడానికి వీలు పళ్ళే దనీ, అది వెళ్తానే యిది దిగుతుందనీ చెప్పింది. 'హమ్మయ్య – రక్షించావు!' అన్నా రంతా. ఒక్కసారి అందరి ముఖాల్లోనూ కళ వచ్చింది. ఆ కాసేపూ ప్లేన్‌లో అందరూ భయపడ్డందుకు నాకో విధమైన ఆత్మసంతృప్తి కలిగింది – ప్లేన్ దిగింది – చక్రాలు భూమ్మీద ఆనేవరకూ నాకింకా సందేహం తీరలేదు. టక్కున చక్రాలు భూమికి తగిలాయి. ప్లేన్ కార్లాగా పోతోంది. అబ్బ యిక ఫర్వాలేదు. సీట్లో వెనక్కి చేరబడ్డాను; ఎక్కడలేని నీరసం వచ్చేసింది. ఇట్లా ప్రయాణం చేస్తారా ఎవరైనా? ఛాఛా, అతన్ని చూశాను...నాలాగే పది లంఖణాలు చేసినట్లు అయిపోయాడు. అతన్ని చూడగానే నేనూ, అతను పడ్డ అవస్థ తలుచుకుని, అంతవరకూ అణుచుకున్న నవ్వు కట్టలు తెంచుకురావడం మొదలెట్టింది. దిగేప్పుడు యిద్దరు హోస్టెస్‌లూ నవ్వుతూ గుడ్‌బై చెప్పారు. నా వెనకాలే అతనూ దిగాడు. ఆశ్చర్యం!



అతనికోసం ఎవరెవరో పూలమాలలు తీసుకొచ్చి అతని దగ్గిరి కొస్తూనే వరసనా అయిదారు మాలలు అతని మెళ్ళో వేసేశారు.

'ఏమిటీ అన్యాయం! ఎవరీ వీరుడు! ఎందుకు వేశారు మాలలు! ఏం ఘనకార్యం చేశాడనీ' మాకేం అర్థం కాలేదు–'బహుశా ఇందాక ప్లేన్‌లో అతను వేసిన వెర్రి కేకలకు మాలలు తెచ్చి వేస్తున్నారేమో!' అన్నది మొదటావిడ. రెండో ఆవిడకి అతనికి మాలలు వేసినవాళ్ళు తెలుసల్లే వుంది. ఆవిణ్ని చూస్తూనే పలకరించి మాట్లాడారు. ఆ అబ్బాయిని గురించి అడిగింది. వాళ్ళ బంధువు లబ్బాయిట – బాగా డబ్బున్న వ్యాపారస్థులట. స్కూలు ఫైనల్ తర్వాత చదవకుండా వూరికే వున్నాడని, డబ్బుందిగదా అట్లా తిరిగివస్తాడని – విదేశాలు చూసిరావడానికి పంపుతున్నారట. అందుకే మాలలు తెచ్చారు.

"ఓహో వెళ్ళబోతున్నాడు!! అయితే యిక వెళ్ళడు." అన్నది మొదటి స్నేహితురాలు.

"అదేమిటీ! శుభమా అంటూ పాపం!" అన్నది రెండో ఆవిడ నవ్వుతూ.

"నే చెప్పాగా! చూడూ ఇక చస్తే ప్లేనెక్కడు.

"నే చెప్పాగా చూడూ!" అన్నది మొదటావిడ. నిజంగానే నా మొదటి స్నేహితురాలి వాక్కు అమోఘం...ఆవిడన్నట్లే రెండు రోజుల తర్వాత రెండో స్నేహితురాలు టెలిఫోన్ చేసి చెప్పింది

ప్లేన్ అంటే హడలెత్తిపోతున్న ఆ అబ్బాయి మర్నాడే రైలెక్కి వాళ్ళ వూరు వెళ్ళిపోయాట్ట. విదేశాలూ వద్దు పాడూవద్దు; బ్రతికుంటే బలుసాకైనా తిని వుండచ్చుని.

"నే చెప్పాగదర్రా!" అన్నది త్రికాల జ్ఞాని నా మొదటి స్నేహితురాలు. నిజం చెప్పాలంటే ఆ తరువాత మళ్ళీ ఇంత వరకు నేను ప్లేన్ ఎక్కలా.